క్లుప్తంగా

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటలు పరిశీలిస్తున్న ఎంపీడీవో

చింతలమానెపల్లి: విద్యార్థులకు ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్, ఎంఈవో జయరాజ్‌లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కస్తూరిబా విద్యాలయాన్ని తనిఖీ చేశారు. తరగతి గదులు, భోజనశాల, పరిసరాలను వారు పరిశీలించారు. వంటగది, కూరగాయల వివరాలు అడిగి తెలుసుకున్నారు. కూరగాయలు సరఫరా చేస్తున్న ఏజెన్సీలు వారానికి ఒకసారే సరఫరా చేస్తున్నందున కొన్ని కూరగాయలు వాడిపోతున్నాయని సిబ్బంది తెలిపారు. విద్యార్థుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపిన అధికారులు



మొక్క అందజేస్తున్న అధికారులు

ఆసిఫాబాద్: నూతన సంవత్సరం పురస్కరించుకొని జిల్లా విద్యుత్ శాఖ అధికారి రాథోడ్ శేషారావు ఆధ్వర్యంలో ఆ శాఖ ఉద్యోగులు కలెక్టర్ వెంకటేశ్ దోత్రే, అదనపు కలెక్టర్లు దీపక్ తివారి, ఎం డేవిడ్‌లకు కలెక్టరేట్‌లో వేర్వేరుగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ ఫిరోజ్‌ఖాన్, జిల్లాలోని విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి అజ్మీరా శ్యాంనాయక్ కలెక్టర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్పీని కలిసిన ఎస్సై



మొక్కను అందజేస్తున్న ఎస్సై చంద్రశేఖర్

రెబ్బెన: జిల్లా కేంద్రంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ డీవీ శ్రీనివాసరావును రెబ్బెన ఎస్సై డి. చంద్రశేఖర్ మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన సంవత్సరం సందర్భంగా మొక్కను అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

ఏకరూప దుస్తులు పంపిణీ



పంపిణీ చేస్తున్న ఆత్రం లక్ష్మణ్

కెరమెరి: మండలంలోని మోడి గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఏకరూప దుస్తులు పంపిణీ చేశారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదువుకుంటున్న 411 మంది బాలికలకు యూనిఫాంతో పాటు బెడ్‌షీట్స్, కార్పెట్స్, టవల్స్, బ్లాంకెట్స్ అందజేసినట్లు హెచ్‌ఎం నర్సయ్య తెలిపారు. కార్యక్రమంలో ఎస్సీఆర్ చహకటి శ్యాంరావు, మాజీ జెడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి



అంగన్‌వాడీని తనిఖీ చేస్తున్న సీడీపీవో

నార్నూర్: అంగన్‌వాడీ కేంద్రం ద్వారా గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని సీడీపీవో శారద అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జీన్‌గూడ అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రానికి సరఫరా అయ్యే సరకుల్లో నాణ్యతను పరిశీలించారు. అంగన్‌వాడీ టీచర్లు సమయపాలన పాటించాలని సూచించారు. ఆమె వెంట పంచశీల, అంగన్‌వాడీ టీచర్, తదితరులు ఉన్నారు.

నేడు వైద్య శిబిరం

ఇచ్చోడ: మండలంలోని సిరిచెల్మలో శనివారం మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. శుక్రవారం ఆయన పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆదిలాబాద్, ఇతర ప్రాంతాల వైద్యులు వైద్య పరీక్షలు చేయనున్నట్లు పేర్కొన్నారు. సిరిచెల్మ చుట్టూ పక్కల గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. క్యాంపు తర్వాత దుప్పట్ల పంపిణీ చేస్తామన్నారు. ముఖ్య అతిథిలుగా ఆదిలాబాద్ ఎస్పీ గౌస్ ఆలం, ఉట్నూర్ ఏఎస్పీ కాజల్, తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

సావిత్రిబాయి పూలేకు ఘన నివాళి



పెంచికల్‌పేట్: నివాళులర్పిస్తున్న నాయకులు



ఆసిఫాబాద్‌అర్బన్: పూలమాలలు వేస్తున్న నాయకులు



చింతలమానెపల్లి: నివాళులర్పిస్తున్న అధికారులు



బెజ్జూర్: జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

సావిత్రిబాయి పూలే జయంతిని శుక్రవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కార్యాయాలల్లో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహిళా సాధికారతకు ఆమె చేసిన సేవలను కొనియాదారు. బాలికల చదువు కోసం విద్యాలయాలు స్థాపించి బాలికల విద్యను ప్రోత్సహించారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం సావిత్రిబాయి పూలే జయంతిని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం హర్షనీయమన్నారు. ఆయా కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పాల్గొన్నారు. – సాక్షి, నెట్‌వర్క్



కౌటాలలో..



దహెగాం: నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు



కెరమెరి: నివాళులర్పిస్తున్న విద్యార్థులు



సిర్పూర్(టి): ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



రెబ్బెన: కొండపెల్లిలో..

చిత్రం గీసి.. అభిమానం చాటి..



రవితేజ గీసిన పూలే దంపతుల చిత్రం

కెరమెరి: మహాత్మా జ్యోతిబా పూలే, సావిత్రిబాయి పూలే చిత్రాలను మండలంలోని గోయగాం ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వర్తిస్తున్న ఉపాధ్యాయుడు రవితేజ పెన్సిల్‌తో గీసి తన అభిమానాన్ని చాటుకున్నాడు. శుక్రవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆయన గీసిన చిత్రం ఆకట్టుకుంది.

నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ



పంపిణీ చేస్తున్న శ్రీనివాస్

కెరమెరి: మండలంలోని పెద్దసాకడ గ్రామంలో గిరిజన ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుక్రవారం నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసినట్లు పెందోర్ శ్యాంరావు, సేవా సమితి వ్యవస్థాపకుడు పెందోర్ శ్రీనివాస్ తెలిపారు. విద్యార్థులు ఉన్నతంగా ఎదిగి తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో గ్రామపటేల్ కుస్సెంగ సోంజీ, హెచ్‌ఎం సుర్పం రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్.. పరేషాన్..!



కౌటాల వైన్స్ సమీపంలో పడేసిన ప్లాస్టిక్ కవర్లు

- విచ్చలవిడిగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం
- అమలు కానీ నిషేధం
- తనిఖీ చేయాలని అధికారులు

కౌటాల: పర్యావరణానికి, ప్రజల ఆరోగ్యానికి హాని కలిగించే పాలిథిన్ కవర్ల వాడకం జిల్లాలో విచ్చలవిడిగా కొనసాగుతోంది. ప్లాస్టిక్ నివారణకు ప్రభుత్వాలు కృషి చేస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో ఫలితాలు రావడం లేదు. ప్రస్తుతం ప్రతీరోజు భూమిపై పోగవుతున్న ప్లాస్టిక్‌ను కంట్రోల్ చేయకపోతే 2050 నాటికి సముద్రంలో ఉన్న చేపల బరువు కంటే ఎక్కువ ప్లాస్టిక్ చెత్త అక్కడ పేరుకుపోతుందని అంతర్జాతీయ నివేదికలు పేర్కొంటున్నాయి. వీటికి తోడు ప్లాస్టిక్ కవర్లు, బాటిల్స్ కారణంగా డ్రెయినేజీ మూసుకుపోయి వరద సమస్యలు తలెత్తున్నాయి.

నిషేధం అమలేది?

పర్యావరణానికి ముప్పు తెస్తున్న ప్లాస్టిక్ ప్రతిఒక్కరి జీవితంలో భాగమైంది. పాలిథీన్ కవర్ల వాడకంతో ఎన్నో అనర్థాలు ఉన్నాయనే కారణంతో ప్రభుత్వం ప్లాస్టిక్‌ను నిషేధించింది. కాని అమలు మాత్రం కావడం లేదు. గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో చెత్త సేకరణ జరుగుతుంది. పట్టణాల్లో, మండల కేంద్రాల్లో, గ్రామ పంచాయతీల్లో చెత్తను సేకరించి డంపింగ్‌యార్డుకు తరలిస్తున్నారు. చెత్తలో అధిక శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. బహిరంగంగా ప్లాస్టిక్ కవర్ల వినియోగం.. అమ్మకాలు ఆగడం లేదు. భయం లేకుండా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారు. కొందరు వ్యాపారులు ధనార్జనే ధ్యేయంగా అక్రమ దందా చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ప్లాస్టిక్‌కు బదులుగా జనపనార, కాగితం ఉత్పత్తుల వాడకంపై ప్రజలను చైతన్యవంతం చేయాలి.

పట్టించుకోని అధికారులు..

ప్రతీ షాపుల్లో ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. వారసంతల్లో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లలోనే వస్తువులు ఇస్తున్నారు. బేకరీల్లో, కిరాణా షాపుల్లో, వైన్స్ షాపుల వద్ద ప్లాస్టిక్ వినియోగం అధికంగా ఉంది. ప్లాస్టిక్‌ను ఇదే విధంగా వాడితే పర్యావరణానికి పెను ముప్పు పొంచి ఉందని పర్యావరణ ప్రేమికులు అంటున్నారు. అధికారులు తరుచూ దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి కఠిన చర్యలు తీసుకోవాలి. ఇలా చేయడంతో పాలిథీన్ విక్రయించడం, వాడకం తగ్గే అవకాశం ఉందని పలువురు కోరుతున్నారు.

చర్యలు తీసుకోవాలి

కిరాణా షాపుల్లో, బేకరీల నిర్వాహకులు ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. పలువురు కిరాణా షాపుల యజమానులు అధిక మొత్తంలో ప్లాస్టిక్ కవర్లను నిల్వ చేసి చిరు వ్యాపారులకు అధిక ధరలకు విక్రయిస్తున్నారు. కిరాణా షాపులు, బేకరీలు, ప్లాస్టిక్ కవర్లు విక్రయించే దుకాణాల్లో అధికారులు తనిఖీలు చేసి చర్యలు తీసుకోవాలి. వారసంతల్లో విచ్చలవిడిగా ప్లాస్టిక్‌ను వినియోగిస్తున్నారు.

– శంకర్, కౌటాల.

జరిమానా విధిస్తాం



ప్లాస్టిక్ వ్యర్థాలను నిర్మూలించేందుకు వ్యాపారులు, ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణం దెబ్బతింటుంది. కౌటాల వారసంతలో ప్లాస్టిక్ వినియోగించే వ్యాపారులకు, కౌటాల వైన్స్ షాపులకు జరిమానా విధించాం. కౌటాలలోని అన్ని దుకాణాల్లో తనిఖీలు చేసి నిషేధిత ప్లాస్టిక్‌ను విక్రయిస్తున్న వ్యాపారులకు జరిమానా విధిస్తాం.

– ఎస్. సాయికృష్ణ, పంచాయతీ కార్యదర్శి, కౌటాల

అసంపూర్తిగా సులభ్‌కాంప్లెక్స్ నిర్మాణ పనులు

- నిధుల కొరతతో పూర్తికాని పనులు
- ప్రజలకు తప్పని తిప్పలు



మండల కేంద్రంలో నిర్మించిన సులభ్‌కాంప్లెక్స్

రెబ్బెన: మండల కేంద్రానికి వివిధ అవసరాల నిమిత్తం వచ్చే ప్రజలు, విద్యార్థులు, ఉద్యోగస్తులు, ఒంటికి, రెండింటికి వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రంలో ప్రజల సౌకర్యం కోసం సులభ్‌కాంప్లెక్స్ అందుబాటులో లేకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. మూడు సంవత్సరాల క్రితం సింగరేణి సీఎస్ఆర్ నిధులతో సులభ్ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినట్టినప్పటికీ నిధుల కొరత కారణంగా పనులు నిలిచిపోయాయి. కొద్దిపాటి నిధులు సమకూరితే నిర్మాణ పనులు పూర్తయి సులభ్‌కాంప్లెక్స్ ప్రజలకు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు.

రూ. 5 లక్షలతో పనులు..

ఎన్నో ఏళ్లుగా మండల కేంద్రంలో సులభ్‌కాంప్లెక్స్ అందుబాటులో లేకపోవటంతో ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. మండలంలో 24 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతీరోజు ఏదో ఒక పని నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. వారితో పాటు పక్క మండలాల్లో చదువుకునే విద్యార్థులు, విధులు నిర్వహించే ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. మూడేళ్ల క్రితం రూ. 5 లక్షల సింగరేణి సీఎస్ఆర్ నిధులతో సులభ్‌కాంప్లెక్స్ మంజూరు చేశారు. ఆర్అండ్‌బీ స్థలంలో నిర్మాణ పనులు చేపట్టారు. చకచక పనులు చేపట్టడంతో సులభ్‌కాంప్లెక్స్ భవన నిర్మాణంతో పాటు లోపల మూత్రశాలలు, మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి చేశారు. అయితే మిగిలిన పనులు పూర్తి చేసేందుకు నిధులు సరిపోక పోవకపోవటంతో అర్థాంతరంగా పనులు నిలిచిపోయాయి. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సులబ్ కాంప్లెక్స్‌ను పూర్తి చేయాలని కోరుతున్నారు.

రైతుభరోసా ఇవ్వాలి

కౌటాల: పీపీ ల్యాండ్ భూముల్లో పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం రైతు భరోసా పథకం వర్తింప జేయాలని బీజేపీ మండలాధ్యక్షులు నారులే వానుపటేల్ అన్నారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో పీపీ ల్యాండ్ రైతులకు ప్రభుత్వ పథకాలను అందించాలని కోరుతూ తహసీల్దార్ పుష్పాలతకు వినతిపత్రం అందజేశారు. మండలంలోని పలు గ్రామాలకు చెందిన రైతులు గత వంద ఏళ్లుగా పీపీ ల్యాండ్ భూముల్లో పంటలు సాగు చేస్తూ జీవిస్తున్నారని తెలిపారు. గత ప్రభుత్వాలు రైతులకు ప్రభుత్వ పథకాలను వర్తింపజేయాలని, బ్యాంకుల్లో రుణాలు ఇచ్చాయన్నారు. ఆయన వెంట రైతులు ఉన్నారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలన



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

బెజ్జూర్: మండల కేంద్రంలోని వరి కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం తహసీల్దార్ భూమేశ్వర్ పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకుని వచ్చిన ప్రతీ ధాన్యం గింజను కొనుగోలు చేయాలని సూచించారు. రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు.

కొనసాగుతున్న హమాలీల దీక్ష



సమ్మెలో పాల్గొన్న హమాలీ కార్మికులు

ఆసిఫాబాద్‌అర్బన్: హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని జిల్లా జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డు వద్ద చేపట్టిన నిరసన దీక్షలు శుక్రవారానికి 3వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు దివాకర్ మాట్లాడుతూ.. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా హమాలీ రేట్లను క్వింటాలుకు రూ. 26 నుంచి రూ. 35కు పెంచాలని డిమాండ్ చేశారు. ఇతర డిమాండ్లను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, లేని పక్షంలో సమ్మెను ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, తుకారాం, మోహన్, కొమురక్క, తదితరులు పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

ఆసిఫాబాద్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని వాసవీక్లబ్ చార్టెడ్ ప్రసిడెంట్ గంధం శ్రీనివాస్ అన్నారు. సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని శుక్రవారం జిల్లా కేంద్రంలోని వాసవీ మందిర ఆవరణలో వాసవీక్లబ్ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులను శాలువాతో సన్మానించారు. ప్రభుత్వం జనవరి 3న మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం అభినందనీయమన్నారు. భారతీయ సమాజంలో గొప్పమార్పులకు సావిత్రీబాయి పూలే పునాది వేశారన్నారు. మహిళా ఉపాధ్యాయులు తాటిపెల్లి జ్యోతి, కందుకూరి అమరావతి, స్వరూప, క్లబ్ అధ్యక్షుడు పాత శ్రీనివాస్, కోశాధికారి కట్కూరి కిషోర్, క్లబ్ అంతర్జాతీయ సభ్యులు చిలువేరి వెంకటేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న సీఐ రమేశ్, సభ్యులు

కౌటాల: తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ క్యాలెండర్‌ను శుక్రవారం కౌటాల పోలీస్ సర్కిల్ కార్యాలయంలో కౌటాల సీఐ ముత్యం రమేశ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన విద్యను అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సోయం ఇందురావ్, రావుల వినోద్, చౌదరి గుణాకర్, క్రిష్ణ, ప్రశాంత్ పాల్గొన్నారు.

వాంకిడి: టీఎస్ యూటీఎఫ్ నూతన క్యాలెండర్‌ను శుక్రవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ శ్రావణ్ కుమార్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యనందిచాలన్నారు. నిరంతరం విద్యాభివృద్ధికి, సమాజాభివృద్ధికి పాటు పడాలన్నారు. కార్యక్రమంలో నాయకులు బూరం దుర్గయ్య, నవీన్ కుమార్, పాండురంగ, సాయి కుమార్, రాజలింగు, కేశవ్‌రావు, రవి పాల్గొన్నారు.

రెబ్బెన: మండలంలోని నవేగాంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం పీఆర్టీయూ టీఎస్ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎంఈవో వెంకటేశ్వర్లు ఆవిష్కరించారు. కార్యక్రమంలో బత్తుల సదానందం, వెంకటేశ్, ప్రవీణ్, సీనియర్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా వినతిపత్రం



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వాంకిడి: ఎస్సీ వర్గీకరణపై ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన ఏకసభ్య కమిషన్‌లో డాక్టర్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కమిటీ, అంబేడ్కర్ సంఘం సభ్యులు వర్గీకరణకు వ్యతిరేకంగా శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 341, 342, 343 ప్రకారం అంబేడ్కర్ ఎక్కడా వర్గీకరణకు సంబంధించిన విషయాన్ని పొందుపర్చలేదన్నారు. ఎస్సీ రిజర్వేషన్లను యథాతథంగా కొనసాగించాలని కోరారు. కార్యక్రమంలో బీఎస్ఐ జిల్లా అధ్యక్షుడు అశోక్ మహోల్కర్, ఉపాధ్యాక్షుడు చునార్‌కార్ తుకారాం, ఉప్రె వినేష్, శ్యాంరావు, దుర్గె పుల్లయ్య, దుర్గం శ్యాంరావు, రాజేంద్రప్రసాద్, రోషన్, అరుణ్ పాల్గొన్నారు.